# 'అమ్మ... అ... మ్మ

పులగం చిన్నారాయణ

**రాత్రి తొమ్మిదయింది.**

**ట్రాఫిక్ జామ్ కావడంతో రూమ్‌కి ఏడుగంటలకి చేరుకోవాల్సినవాడిని రెండు గంటలు ఆలస్యంగా చేరాను.**



బస్సులో చాలాసేపు నిలబడి ఉండటంతో కాళ్లు తిమ్మిరెక్కిపోతున్నాయి. శరీరమంతా నిస్సత్తువ ఆవరించింది. ఆకలి పేగుల్ని కరకరా నమిలేస్తోంది.

ఉదయం పూట వంట చేసుకున్న పాత్రలన్నీ శుభ్రం చేసుకుని వంట వండుకోవాలి. ఛీ! వెధవ బతుకు! నా జీవితం మీద నాకే విరక్తి కలిగింది.

రూమ్ అంతా నిశ్శబ్దంగా ఉంది. స్నేహితులు తమ ఊళ్లకి వెళ్లడంతో మరీ బోర్‌గా ఉంది.

పాత్రల్ని క్లీన్ చేస్తుంటే అమ్మ గుర్తొచ్చింది. అమ్మకి ఎంత ఓపిక! ఉదయం ఐదు గంటల నుండి రాత్రి పది గంటల వరకూ ఎంత కష్టపడుతుంది! అర్ధరాత్రవనీ, అపరాత్రవనీ ఓపిక ఉన్నా, లేకున్నా ఎంత గాఢ నిద్రలో ఉన్నా, ఒంట్లో నలతగా ఉన్నా సరే, ఇంటికి బంధువులొస్తే చాలు ఆప్యాయంగా పలకరిస్తుంది. ఉదయం నుంచి గొడ్డుచాకిరీ చేసి అలిసిపోయి ఉండి కూడా బంధువులకి రాచమర్యాదలు చేస్తుంది.

కానీ నా ఒళ్లు నేనే మోసుకోవడానికి బద్ధకం! నాకు నేను వంట చేసుకోవడానికే ఇంతలా తిట్టుకుంటున్నానే, మరి ఇంటిల్లిపాదికీ వండి పెట్టే అమ్మ ఎంత తిట్టుకోవాలి?

స్టవ్‌మీద అన్నం ఉడుకుతుంటే, నా మనసు అమ్మ గురించే ఆలోచిస్తోంది. విసుగనేది లేకుండా మరమనిషిలా చేస్తున్నా, కూరలో ఉప్పెక్కువైంది, చెట్నీలో ఇంకేదో తక్కువైందీ, అర్జంట్‌గా ఆమ్లెట్ కావాలని నేనెంత గొడవ చేసేవాడిని! అవన్నీ తలుచుకుంటుంటే నా ప్రవర్తన నాకే సిగ్గనిపిస్తుంది. పీసమెత్తయినా అమ్మకు సాయం చేయడం పోయి, అమ్మ పనులకు ఎన్ని వంకలు పెట్టేవాడిని!

ఎందుకో నా మనసంతా అదోలా అయిపోయింది. ఒక్కసారి గట్టిగా అమ్మను కౌగలించుకుని భోరున ఏడవాలనిపిస్తోంది. క్షమించమని అడగాలనిపిస్తోంది.

అమ్మ దగ్గరకు వెళ్లాలంటే ఇంకా రెండు నెలలు ఓపిక పట్టాలి. అప్పుడైనా అమ్మకు చేదోడు వాదోడుగా ఉండాలని గట్టిగా మనసులో నిర్ణయించుకున్నాను.

స్టవ్‌మీద అన్నం మాడువాసన కొడుతుంటే ఈ లోకంలోకి వచ్చాను.

✣ ✣ ✣

ఇరవై రెండేళ్లకు తొలిసారిగా అమ్మా, నాన్నలకు దూరంగా ఉండాల్సివచ్చింది.

డిగ్రీ పూర్తయిన తర్వాత స్పెషలైజ్డ్ కంప్యూటర్ కోర్సుకోసం ఆరు నెలలు హైదరాబాదులో ఉండాల్సి వచ్చింది. సింగిల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌లో నేను, మరో ముగ్గురం ఉంటున్నాం. మొదట్లో మెస్‌లోనే భోజనం. తర్వాత స్నేహితులతోనే కలిసి స్వయం పాకం చేయడం ప్రారంభించాను.

నాన్నగారు నన్ను చూడటంకోసం నెలకు ఒకసారి వచ్చి వెళ్తున్నారు. చూస్తూండగానే ఆరు నెలలు గడిచిపోయాయి. హాపీగా సర్టిఫికెట్ తీసుకుని ఇంటికి వచ్చేశాను. నన్ను చూడగానే అమ్మ ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

"కన్నా! అలా చిక్కిపోయావేంరా?" అంటూ కుశల ప్రశ్నలు వేసింది.

రాత్రంతా ప్రయాణంలో నిద్ర లేకపోవడంతో స్నానం చేయగానే నిద్ర వచ్చేసింది.

"మధ్యాహ్నం అయిపోయిందిరా! లేవరా, కన్నా!" అని అమ్మ నన్ను లేపుతుంటే ఒక్కసారిగా కసురుకున్నాను - "ఏంటమ్మా డిస్టర్బెన్స్! ఆరు నెలలు సరిగ్గా తిండీ, నిద్రా లేక మొఖం వాచిపోయి ఉంటాను. గొడవ చేయకు!" అని విసుక్కుని తిరిగి నిద్రలోకి జారుకున్నాను.

అమ్మ ఏమనుకుందో తెలియదు కానీ, అరగంట తర్వాత నాన్నగారు వచ్చి లేపడంతో తప్పదన్నట్టు లేచాను.

అమ్మ నాకిష్టమని గుత్తి వంకాయ కూర, బంగాళదుంప కూర్మా, ఇంకా పాయసం చేసింది. ఆరు నెలల తర్వాత చాలా ఆనందంగా, సంతృప్తిగా భోజనం చేశాను.

ఆ సమయంలో అమ్మకు చేదోడు వాదోడుగా ఉండాలన్న నా నిర్ణయం గుర్తొకొచ్చి, 'ఎస్! ఈ క్షణం నుంచే నా నిర్ణయాన్ని అమలు చేయాలి! పాపం, ఇందాక విసుక్కుని కష్టపెట్టాను. నా ఎంగిలి కంచం ఇక నుండి నేనే కడుక్కుంటాను!' అని అనుకుంటూనే సుష్టుగా భోజనం చేశాను.

వాష్‌బేసిన్‌లో చేయి కడుక్కుంటుంటే, "హాయ్ మధూ!" అంటూ నా ప్రాణ స్నేహితులు రంగప్రవేశం చేశారు.

నేను గబగబా డ్రెస్ ఛేంజ్ చేసుకుని స్నేహితులతో షికారుకు బయలుదేరాను. ఆ సమయంలో నేను తీసుకున్న నిర్ణయం గుర్తుకు రాలేదు. అప్పుడే కాదు, ఇప్పటికి కూడా నా నిర్ణయాన్ని సక్రమంగా అమలు చేయలేకపోయాను.

✣ ✣ ✣

చివరకు అమ్మకు తలకొరివి కూడా పెట్టలేక పోయాను. అమెరికా నుండి నేను రావడం ఆలస్యమై నా పని కాస్తా నాన్నగారు పూర్తిచేశారు. ■